క్లుప్తంగా

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



వైఎస్సార్ బీమా తక్షణసాయం అందజేస్తున్న వైస్ ఎంపీపీ జగన్‌మోహన్‌రావు

రేగిడి: మండలంలోని బూరాడకు చెందిన పిన్నింటి కన్నమ్మ ఇటీవల మృతి చెందగా ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10 వేలను వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్‌మోహన్‌రావు చేతులమీదుగా గురువారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వావిలపల్లి శశిభూషణరావు, వైకేపీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాజాం సిటీ: స్థానిక ఐటీలో ఖాళీగా ఉన్న మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 19వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 20న సర్టిఫికెట్ల పరిశీలన, 22న కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 8309438446, 8328584366ను సంప్రదించాలన్నారు.

బొబ్బిలి: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో వివిధ ట్రేడులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బండారు భాస్కరరావు ఓ ప్రకటనలో గురువారం కోరారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులంతా ఈ నెల 19వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 20న దరఖాస్తుల పరిశీలన, 22న కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 9492023220ను సంప్రదించాలన్నారు.

నేత్రదానానికి ముందుకురావాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ నర్సింహులు

రాజాం సిటీ: నేత్రదానానికి ముందుకు రావాలని, నేత్రదానమనేది సంప్రదాయం కావాలని జెడ్పీటీసీ బండి నర్సింహులు అన్నారు. మండలంలోని పెనుబాక గ్రామ వెల్‌నెస్ సెంటర్‌లో జరిగిన 38వ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా ఆరోగ్య కార్యకర్తలతో అవగాహన ర్యాలీ గురువారం చేపట్టారు. అంతకు ముందు జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఒకరి మరణం మరో ఇద్దరి జీవితాల్లో వెలుగు(చూపు)ను నింపాలని, అందుకు నేత్రదానం ఒక్కటే మార్గమన్నారు. ప్రతి ఒక్కరూ మూఢనమ్మకాలు విడనాడి నేత్రదానం చేయాలని కోరారు. ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంతరావు మాట్లాడుతూ నల్లగుడ్డు పొరల అంధత్వానికి కారణాలు, నివారణోపాయాలను వివరించారు. కార్యక్రమంలో బి.రంగనాథం, ఎంఎల్‌హెచ్‌పీ దేవమణి పాల్గొన్నారు.

మున్సిపల్ కో–ఆప్షన్ మెంబర్ సస్పెన్షన్



రియాజ్ ఖాన్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటిస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు

బొబ్బిలి: మున్సిపల్ కో–ఆప్షన్ మెంబర్ రియాజ్ ఖాన్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు అధ్యక్షతన గురువారం జరిగిన కౌన్సిల్ అత్యవసర సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. వైస్ చైర్మన్ చెలికాని మురళి మాట్లాడుతూ కో–ఆప్షన్ సభ్యుడిగా ఉంటూ మున్సిపల్ పాలకవర్గ సంప్రదాయాలను పక్కనబెట్టి, కనీస గౌరవమర్యాదలు పాటించకుండా, మున్సిపల్ చైర్మన్, తదితరులపై తీవ్ర దూషణకు పాల్పడినందుకు గాను ఆయనను సస్పెండ్ చేయాలని ప్రతిపాదించామని, దీనికి కౌన్సిల్ సభ్యులు కూడా ఆమోదం తెలిపారన్నారు. దీంతో ఆయనపై చర్యలు తీసుకున్నామన్నారు.

చురుగ్గా ఈ–క్రాప్ నమోదు



చాటాయవలసలో ఈ–క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: మండలంలోని అంబకండి, ఉంగరాడ, సోమరాజుపేట, చాటాయవలస గ్రామాల్లో ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ చాలా చురుగ్గా కొనసాగుతోంది. గురువారం చాటాయవలసలో జరుగుతున్న ఈ–క్రాప్ బుకింగ్‌ను పరిశీలించిన మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ పంటలకు రసాయనిక ఎరువులు అధికంగా వాడవద్దని, అలా చేస్తే పంటకు చీడపీడలు ఆశించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ప్రతీ రైతు తమ పంటకు సంబంధించి, ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని, అలా చేస్తే పంటను సులభంగా రైతు భరోసా కేంద్రాల్లో విక్రయించుకునే అవకాశం కలుగుతుందన్నారు.

సీఎం జగన్‌తోనే గ్రామస్వరాజ్యం

- ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



సచివాలయ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

వంగర: మహాత్మాగాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. గురువారం మండలంలోని అరసాడ గ్రామంలో దాదాపు రూ.2.47 కోట్ల వ్యయంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కలిసి శంకుస్థాపన చేయడంతో పాటు ఇదే గ్రామంలో మరో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామసచివాలయ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పరిపాలన కొనసాగుతోందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్ సీపీకే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఏదైనా అభివృద్ధి పని జరగాలన్నా, కుల, ఆదాయం వంటి ధ్రువీకరణపత్రాలు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు కావాలన్నా మండల కేంద్రానికి వెళ్లాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు అలా కాదని, ప్రజల వద్దకే అవన్నీ వస్తున్నాయన్నారు. ప్రతిఒక్కరూ ఇల్లు కదలకుండా ప్రభుత్వ సేవలు, పథకాలు పొందుతున్నారన్నారు. ప్రజలకు మంచి పాలన అందించాలన్న సదుద్దేశ్యంతోనే ప్రభుత్వం ప్రతీ గ్రామంలో కోట్లాది రూపాయలు వెచ్చించి, ప్రభుత్వ భవనాలు నిర్మిస్తోందన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం జగనన్న ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. ఆనాడు అశోకుడు మొక్కలు నాటాడనే వాక్యం ఇప్పటికీ ప్రతీ ఒక్కరి మదిలో నిలిచినట్లే గ్రామాల్లో సుపరిపాలన కోసం సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చిన మాట కూడా రాష్ట్ర ప్రజల నోళ్లల్లో తిరుగుతుందన్నారు. పేదలకు అందుబాటులో ఖరీదైన వైద్యం ఉండాలనే పీహెచ్‌సీలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణంతో పాటు ఫ్యామిలీ డాక్టర్ సేవలు కూడా అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తున్నారని, పేదలకు విదేశీ విద్యను అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని చూసి టీడీపీ, జనసేన పార్టీల నేతలు, ఎల్లోమీడియా దుష్ప్రచారం చేస్తున్నారని, వాటిని ప్రజలు తిప్పికొట్టాలన్నారు. 2024లో జరగనున్న ఎన్నికల్లోనూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, పార్టీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, వైస్ ఎంపీపీ పున్నాన సత్యనారాయణ, సర్పంచ్‌లు లచ్చుభుక్త సత్యనారాయణ, చింతగుంట రామారావు, తెంటు జోగినాయుడు, రెడ్డి కృష్ణ, శనపతి సత్యారావు, బి.విజయ్‌కుమార్, బలరాంనాయుడు, రామారావు మాష్టారు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు



పాగిరిలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: అర్హతే ప్రామాణికంగా, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తోందని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గురువారం మండలంలోని పాగిరి గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు నాలుగున్నరేళ్లగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలుచేస్తున్న పథకాలను వివరించారు. ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, అందుకే ఆయన గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ప్రవేశపెట్టి, ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, లబ్ధిదారుల వద్దకే ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే వీటిని నిలుపుదల చేస్తుందని, ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి, సంక్షేమాన్ని అందిస్తున్న జగనన్న ప్రభుత్వాన్నే మళ్లీ ఎన్నుకోవాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వాలు తమ పార్టీ కార్యకర్తలకు మాత్రమే సంక్షేమ పథకాలు అందించేవన్నారు. టీడీపీ ప్రభుత్వం పూర్తిగా సంక్షేమాన్ని కాలరాసిందన్నారు. పవన్ కల్యాణ్‌కు రాజకీయ పరిజ్ఞానం లేదని, టీడీపీ మాయలో పడి, అతడు అతడి అభిమానులను మోసం చేస్తున్నాడన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లావేటి సులోచన, సర్పంచ్ పాగిరి కృష్ణవేణి, వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీరంగంనాయుడు, ఎంపీడీవో బాసూరి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకుసాగాలి



కుట్టుమిషన్ శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే శంబంగి, ఎంపీపీ లక్ష్మి

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: మహిళలు తమ స్వశక్తిమీద నిలబడి, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఇటీవల కుట్టుమిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న 60 మంది మహిళలకు ఎంపీ, ఎమ్మెల్యేల చేతుల మీదుగా గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళలు తమకు ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకుని, ఆ రంగంలో నైపుణ్యం సాధించాలన్నారు. తద్వారా ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం భారత్ డైనమిక్ లిమిటెడ్ ఫైనాన్స్ డైరెక్టర్ ఎస్.శ్రీనివాసులు, హెచ్‌ఆర్ ఎస్.సత్యనారాయణ మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ ఎలా ఉపయోగపడుతుందో వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, ఎంపీడీవో పోతుల రవికుమార్, డీసీఎంఎస్ ప్రతినిధి రమేష్, ఏరియా కో–ఆర్డినేటర్ జె.లక్ష్మణ్‌నాయుడు, ఏపీఎం యు.శ్రీనివాసరావు, ఎఫ్‌సీవో ఎస్.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

నేడు కొండకెంగువలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

రామభద్రపురం: మండలంలోని కొండకెంగువ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పాల్గొంటారని, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలంతా హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు తాగునీటి సరఫరాలో అంతరాయం

బొబ్బిలి: స్థానిక పట్టణంలో శుక్రవారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. పట్టణానికి తాగునీరు అందించే భోజరాజపురంలోని ప్రధాన తాగునీటి వనరుల కేంద్రంలో మరమ్మతుల కారణంగా ఈ అంతరాయం కలుగుతుందని, ప్రజలు గమనించి, సహకరించాలని కోరారు.

నాణ్యమైన విద్యనందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో ప్రసాదరావు

రేగిడి: మండలంలోని బూరాడ ప్రభుత్వ పాఠశాలను ఎంఈవో ఎం.వి.ప్రసాదరావు గురువారం సందర్శించి, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రికార్డులతో పాటు ఉపాధ్యాయుల విద్యాబోధన, విద్యార్థుల విద్యాసామర్థ్యాలు, జగనన్న గోరుముద్ద పథకం అమలును పరిశీలించారు. ప్రతీ విద్యార్థి విద్యాప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారి అభ్యసన సామర్థ్యాల మెరుగుకు కృషి చేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దని ఉపాధ్యాయులకు తెలిపారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



స్మార్ట్ క్లాస్‌రూమ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే జోగులు

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం సిటీ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని పాగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో కొత్తగా ఏర్పాటు చేసిన స్మార్ట్‌క్లాస్ రూమ్‌ను వారు గురువారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అధునాతన డిజిటల్ విధానంలో బోధన అందించేందుకే చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యాబోధనే లక్ష్యంగా సీఎం జగనన్న పనిచేస్తున్నారన్నారు. విద్యార్థులందరికీ సులభంగా అర్థమయ్యేందుకు ఈ విధానం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గతంలో కన్నా మెరుగైన విద్యాబోధనే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇప్పటికే ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణా తరగతులు కూడా నిర్వహించడం జరిగిందన్నారు. వీటిని విద్యార్థులు, ఉపాధ్యాయులంతా సద్వినియోగం చేసుకుని, కార్పొరేట్‌కు దీటుగా ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలన్నారు. ఆ తర్వాత ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన శాసపు సత్యనారాయణను సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో బ్రాహ్మాజీరావు, ఎంపీడీవో బాసూరి శంకరరావు, ఎంఈవో ప్రవీణ్‌కుమార్, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



వెలుగు కార్యాలయంలో పెరటికోళ్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి

తెర్లాం: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలంతా పెరటికోళ్ల పెంపకం చేపట్టి, ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో డ్వాక్రా గ్రూపు మహిళలకు పెరటికోళ్లను ఆమె చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇందిరాక్రాంతి పథం ద్వారా సబ్సిడీపై ఇచ్చే పెరటికోళ్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీటిని బాగా పెంచి, విక్రయిస్తే మంచి లాభాలు వస్తాయన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందేందుకు పెరటికోళ్ల పెంపకం ఎంతో మంచిదన్నారు. వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ చిరంజీవి మాట్లాడుతూ మండలానికి 150 యూనిట్ల పెరటికోళ్ల పెంపకాన్ని లక్ష్యంగా నిర్ణయించామని, ఒక్కో యూనిట్ రూ.2,700 చొప్పున అందజేయడం జరుగుతోందన్నారు. ప్రస్తుతానికి మండలానికి 50 యూనిట్లు పంపిణీ చేస్తున్నామని, ఒక్కో యూనిట్‌లో 10 కోళ్లు ఉంటాయన్నారు. ఏపీఎం టి.రాము మాట్లాడుతూ మండలానికి ఒక మదర్ పౌల్ట్రీ యూనిట్ నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఆసక్తి ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు శ్రీనివాస్, కేశవరావు, మండల సమాఖ్య కార్యదర్శి లక్ష్మి, వీఓఏలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం మెరుగు



రామభద్రపురం: నాయుడువలసలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకుమారి

రామభద్రపురం: పౌష్టికాహారంతో ఆరోగ్యం మెరుగవుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకుమారి అన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందజేసే పౌష్టికాహారంపై గురువారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు ఇస్తున్న పౌష్టికాహారం తప్పనిసరిగా క్రమం తప్పకుండా అందివ్వాలని తెలిపారు. పాలు, గుడ్డు, ఆకు,కాయగూరలు, బెల్లంతో చేసిన శనగ చెక్కీలను ప్రతిరోజూ తినాలని, ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు.

బాడంగి: మండలంలోని రామచంద్రాపురం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం, దాని ప్రయోజనాలపై గురువారం అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ పీవో కె.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకుని, మంచి ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వాడాడ పీహెచ్‌సీ వైద్యులు ఆదిత్య కేంద్రంలోని చిన్నారులకు రక్తపరీక్షలు, గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో–2 రాజేశ్వరి, సూపర్‌వైజర్ వై.వి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



రాజాం: కంచరాంలో శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



బాడంగి: ముగడ కాలనీలో ఉట్టి కొట్టేందుకు సిద్ధమైన యువత



రేగిడి: చిన్నికృష్ణుని కోసం సిద్ధం చేసిన ఊయల



సంతకవిటి: పూజలందుకున్న గోపీకృష్ణులు



రామభద్రపురంలో శ్రీకృష్ణ, సత్యభామ వేషధారణల్లో మెరిసిన చిన్నారులు

వాడవాడలా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున మహిళలు తలంటు స్నానం చేసి, సంప్రదాయ వస్త్రధారణలో మెరిశారు. ఇళ్ల ముంగిళ్లను మామిడితోరణాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. చిన్నికృష్ణుడికి స్వాగతం పలుకుతూ వివిధ రంగులతో పాదముద్రికలు వేశారు. తమ చిన్నారులకు గోపీకృష్ణుల వేషధారణలు వేసి, ఆనందోత్సాహాలతో పండగ జరుపుకున్నారు. సాయంత్రం యువతీయువకులు ఉట్టి కొట్టి, ఆనందించారు.

–సాక్షి నెట్‌వర్క్.

విద్యార్థులతో వర్క్‌బుక్స్ రాయించాలి



విద్యార్థుల వర్క్‌బుక్స్ పరిశీలిస్తున్న ఎంఈవో త్రినాధరావు

తెర్లాం: విద్యార్థులతో ప్రతిరోజూ వర్క్‌బుక్స్ రాయించాలని ఎంఈవో త్రినాధరావు తెలిపారు. స్థానిక ప్రాథమిక పాఠశాలను గురువారం సందర్శించిన ఆయన పాఠశాల రికార్డులు, పరిసరాలు, మరుగుదొడ్లు, జగనన్న గోరుముద్ద పథకం అమలును పరిశీలించారు. అనంతరం విద్యార్థులు వర్క్‌బుక్స్ ఏ విధంగా రాస్తున్నారో తనిఖీ చేసి, పలు సూచనలు చేశారు. అలాగే వివిధ ప్రశ్నలు అడిగి, విద్యార్థుల విద్యా సామర్థ్యాలు అంచనావేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తూ వారి విద్యాప్రగతికి కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌తో ఆర్థిక భరోసా

రామభద్రపురం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) నిరుపేద విద్యార్థులకు ఆర్థిక భరోసానిస్తోందని ఎంఈవోలు తిరుమలప్రసాద్,పెంటయ్య అన్నారు. గురువారం విలేకరులతో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 8వ తరగతి విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్ పొందేందుకు ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.